వైభవంగా యాదగిరీశుడి నిత్య కల్యాణోత్సవం

యాదగిరిగుట్ట, ఆగస్టు 22 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. గురువారం ప్రధానాలయం మొదటి ప్రాకార మండపంలో కల్యాణమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి సేవను కొనసాగించారు. తూర్పునకు అభిష్టంగా స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి నిత్య తిరు కల్యాణోత్సవం జరిపారు. స్వయంభూ నారసింహుడికి నిత్యోత్సవాలు తెల్లవారుజామునే ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున 3:30 గంటలకు ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన జరిపి స్వామి, అమ్మవార్లకు బాలభోగం జరిపారు. స్వయంభూ నారసింహుడికి నిజాభిషేకం నిర్వహించి, భక్తులకు స్వామివారి నిజరూప దర్శనం కల్పించారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన జరిపి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిర్వహించిన అర్చకులు సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను గరుఢ, తిరుచ్చి వాహనాలపై వేంచేపు చేసి ఆలయ మాఢవీధుల్లో సేవను ఊరేగించారు. రాత్రి దర్బార్ సేవ, నివేదన, శయనోత్సవం సేవ అత్యంత వైభవంగా సాగింది. సంకష్టహర చతుర్థి వ్రతం సందర్భంగా శివాలయంలో గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివాలయం ప్రాకార మండపంలో నిత్య రుద్రహోమం అత్యంత వైభవంగా సాగింది. స్వామివారి ఖజానాకు రూ.25,91,404 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

27నుంచి గోకులాష్టమి వేడుకలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 27నుంచి 29వరకు గోకులాష్టమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. మూడు రోజులపాటు కణ్ణన్ తిరునక్షత్రోత్సవాలు శాస్త్రోక్తంగా సాగుతాయని పేర్కొన్నారు. 29న శ్రీకృష్ణ జయంతి సందర్భంగా సాయంత్రం 5గంటలకు శిఖ్యోత్సవం (ఉట్లు కొట్టుట) నిర్వహిస్తామని తెలిపారు. అదేరోజు రాత్రి స్వామివారి ప్రధానాలయంలో రుక్మిణీ కల్యాణోత్సవం జరుపుతామని వివరించారు. ఈ నెల 27న భక్తులతో నిర్వహించే నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవం, సుదర్శన నారసింహ హోమం, బోగాలు రద్దు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఏరియా దవాఖానలో సౌత్ ఏషియా బృందం పరిశీలన

భువనగిరి అర్బన్ : జిల్లా దవాఖానను సందర్శించిన సౌత్ ఏషియా బృందం సభ్యులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 22 : గ్లోబల్ ప్రాక్టీస్ ఫర్ హెల్త్, న్యూట్రిషన్ పాపులేషన్, సౌత్ ఏషియా ప్రతినిధులు, టెక్నికల్ కన్సల్టెంట్ బృందం సభ్యులు జిల్లా ఏరియా దవాఖానను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌లో సౌకర్యాలు, పరికరాలు, రోగులకు అందుతున్న సేవలు, సిబ్బంది, రిజిస్టర్లను తనిఖీ చేశారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌లో రక్త పరీక్షల వివరాలు, జిల్లాలోని వివిధ ఆసుపత్రుల నుంచి తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్‌కు చేరే రక్త నమూనాల రవాణా సౌకర్యాలను పరిశీలించారు. రక్త పరీక్షలు చేసే యంత్రాలను పరిశీలించి టెస్ట్ రిపోర్టు రోగులకు చేరే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. భువనగిరి వైద్య కళాశాల ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి అక్కడి రోగులను అడిగి తెలుసుకున్నారు. వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో బృందం సభ్యులు అపర్ణ సోమనాథన్, ప్రాక్టీస్ మేనేజర్ అజయ్ టాండన్, లీడ్ హెల్త్ ఎకనామిస్ట్ అమిత్ నాగరాజు, సీనియర్ హెల్త్ స్పెషలిస్ట్ లక్ష్మీ శ్రీపాద, సీఐఓఎన్ఎం, ఏబీడీఎం జేడీ బి.మంజునాథ్‌నాయక్, స్టేట్ క్వాలిటీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ నందిత, స్టేట్ తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు, డాక్టర్లు చిన్నానాయక్, ఎల్.యశోద, ఇన్‌చార్జి జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ మనోహర్, ఏడీపీహెచ్‌ఓ పాల్గొన్నారు.

అనంతారం పల్లె దవాఖాన పరిశీలన

భువనగిరి కలెక్టరేట్ : ప్రపంచబ్యాంకు వైద్యారోగ్య శాఖ ప్రతినిధుల బృందం సభ్యులు మండలంలోని అనంతారం పల్లె దవాఖానను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రికార్డులు, రోగుల నమోదు పుస్తకాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పల్లె దవాఖానలో అందుతున్న వైద్య సేవలపై స్థానికులతో మాట్లాడారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యశోద, జిల్లా అదనపు పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ మనోహర్, వసంత, శ్రీనివాస్, సురేశ్ కుమార్ ఉన్నారు.

గ్రామాల్లో ఉత్తర ప్రదేశ్ ట్రైనీ అధికారుల పర్యటన

తుర్కపల్లిలో ట్రైనీ ఆర్ఆర్‌బీ అధికారులకు స్వాగతం పలుకుతున్న మహిళా సమైక్య సభ్యులు

తుర్కపల్లి, ఆగస్టు 22 : ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 30మంది ట్రైనీ ఆర్ఆర్‌బీ అధికారుల బృందం గురువారం తుర్కపల్లి, వెంకటాపురం గ్రామాలను సందర్శించింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ రూరల్ డెవలప్‌మెంట్ హైదరాబాద్‌లో ఈ నెల 21నుంచి 23 వరకు ట్రైనీ ఆర్ఆర్‌బీ అధికారులు శిక్షణ పొందుతున్నారు. క్షేత్ర పరిశీలనలో భాగంగా తుర్కపల్లిని సందర్శించి గ్రామంలో మండల సమైక్య స్వయం సహాయక సంఘాల విలేజ్ ఆర్గనైజేషన్లు నిర్వహిస్తున్న సమావేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సంఘాల సమావేశ విధానాలు, అప్పుల మంజూరు, చెల్లింపులు, స్కూల్ యూనిఫామ్ స్టిచ్చింగ్, అమ్మ ఆదర్శ పాఠశాలల నిర్వహణ వంటి కార్యక్రమాలను పరిశీలించారు. వాటి గురించి మహిళా సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాలు పటిష్టంగా ఉన్నాయని, వాటి పనితీరు బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఎంపీడీఓ రూన్సీలక్ష్మీబాయి, డీపీఎంలు శ్రీనివాస్, సునీల్‌రెడ్డి, ఏపీఎంలు జానీ, మల్లేశం, ఆనంద్, యాదగిరి, సీసీలు పరశురాములు, బాలనర్సయ్య పాల్గొన్నారు.

బీసీ ఉద్యమంలో న్యాయవాదులు ప్రధాన పాత్ర పోషించాలి

- ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లేశ్

రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భువనగిరి బార్ అసోసియేషన్ సభ్యులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 22 : బీసీ ఉద్యమంలో న్యాయవాదులు ప్రధాన పాత్ర పోషించాలని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పూస మల్లేశ్ అన్నారు. బీసీల సమస్యలపై ఈ నెల 25న హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ ఫైన్ ఆర్ట్స్ ఆడిటోరియంలో జరిగే ఓబీసీ న్యాయవాదుల రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను బార్ అసోసియేషన్ సభ్యులతో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల సామాజిక రంగాల్లో జనాభా దామాషా ప్రకారం వాటా కోసం జరిగే పోరాటంలో న్యాయవాదులు ముందుండాలన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచినప్పుడల్లా జనగణన లేదని కోర్టులు అడ్డుపడుతున్నాయని పేర్కొన్నారు. బ్రిటీష్ పాలనలో 1931లో జరిగిన బీసీ జనగణన తర్వాత ఇప్పటి వరకు దేశంలో జనగణన జరుగకుండా చూడడంలో అన్ని పార్టీలదీ ఒకటే ఆలోచనని అన్నారు. ప్రస్తుతం పార్లమెంటులో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీ కుల జనగణన చేయాలని మాట్లాడుతున్నారని, అదే పార్టీ తెలంగాణలో అధికారంలో ఉండి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో వెనుకంజ ఎందుకు వేస్తుందని ప్రశ్నించారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక రంగాలతోపాటు కీలక రంగమైన జ్యుడీషరీలో బీసీలకు సముచిత వాటా దక్కడం లేదన్నారు. ఈ నెల 25న జరిగే సదస్సుకు ముఖ్య అతిథిగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, గౌరవ అతిథిగా హైకోర్టు న్యాయమూర్తి సూరేపల్లి నందతో పాటు బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ హాజరు కానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేన్ అధ్యక్షుడు బబ్బూరి హరినాథ్, ఐఎల్‌పీఏ రాష్ట్ర నాయకుడు మాధవకృష్ణ, న్యాయవాదులు భిక్షమయ్య, సిద్దిరాములు, వెంకటేశ్వర్లు, కృష్ణ, శంకర్, వెంకటేశ్, విద్యాసాగర్ పాల్గొన్నారు.

రుణమాఫీ అమలులో సర్కారు విఫలం

- రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరిలో నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, చిత్రంలో పార్టీ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు

భువనగిరి అర్బన్, ఆగస్టు 22 : అనేక ఆంక్షలు పెట్టి రైతులందరికీ రుణమాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. అర్హులైన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అర్హులైన రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయకపోవడం విడ్డూరమన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుండా రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు పేరుతో ప్రభుత్వం ప్రజలు పక్కదోవ పట్టిస్తుందని ఆరోపించారు. రైతును రాజు చేయాలని మాజీ సీఎం కేసీఆర్ చూస్తే.. రేవంత్‌రెడ్డి మాత్రం అడుక్కునే పరిస్థితి తీసుకొస్తున్నాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు కష్టాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. పెట్టుబడికి రైతుబంధు రాక, వ్యవసాయానికి సక్రమంగా కరెంట్ లేక, పంటకు రూ.500 బోనస్ ఇవ్వక, వారంటీ లేని ఆరు గ్యారెంటీల పేరుతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తుందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలని, లేకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, ప్రధాన కార్యదర్శులు రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నీల ఓంప్రకాశ్‌గౌడ్, నాయకులు జడల అమరేందర్‌గౌడ్, ఎడ్ల రాజేందర్‌రెడ్డి, ఎన్నబోయిన ఆంజనేయులు, ఎడ్ల సత్తిరెడ్డి, బీరు మల్లయ్య, అతికం లక్ష్మీనారాయణ, ర్యాకల శ్రీనివాస్, భగత్, అజీమ్, స్వామి, శంకర్, రమేశ్, శ్రీశైలం, జంగయ్య, పద్మ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయని కాంగ్రెస్ : చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

మాట్లాడుతున్న చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

ఆరు గ్యారెంటీలు, అనేక మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. నెలలు గడుస్తున్నా ఏ ఒక్క హామీని అమలు చేయలేదని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉచిత బస్సు పేరుతో బస్సులు తగ్గించి మహిళలకు చెప్పలేని తిప్పలు తీసుకొచ్చిందని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి గాలి మాటలతో పబ్బం గడుపుతున్నారని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహం కాకుండా, రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడం సరికాదని, అలా చేస్తే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. రుణమాఫీ కాలేదని బ్యాంకు అధికారులను నిలదీసిన, ధర్నాలు చేసిన రైతులను హింసకు గురిచేయడం సరికాదని హెచ్చరించారు. కేసీఆర్ రైతు పక్షపాతి అని, రైతులకు బీఆర్ఎస్ పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని, రైతులు అధైర్య పడొద్దని తెలిపారు. కాళేశ్వరంలో నీళ్లున్నా వదలకుండా ఈ ప్రాంతాన్ని ఎండగట్టిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రైతులు నమ్మే ప్రసక్తి లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉంటే ఈ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండేదని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తన సీటు కాపాడుకోవడంపైనే దృష్టి సారిస్తున్నారని, ప్రజల సంక్షేమం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులదే విజమని ధీమా వ్యక్తం చేశారు.

తక్షణమే రుణమాఫీ చేయాలి : బీఆర్ఎస్

చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, రైతులు

చౌటుప్పల్, ఆగస్టు 22 : ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గిర్కటి నిరంజన్‌గౌడ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. ధర్నాకు చౌటుప్పల్, సంస్థాన్ నారాయణపురం మండలాల్లోని పలు గ్రామాల రైతులు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని రైతులు గమనించాలన్నారు. రైతు భరోసా కింద రూ.15వేలు ఇస్తామని ప్రకటించి ఇప్పటి వరకు వేయలేదన్నారు. ఎన్నికల ముందు నమ్మించి మోసం చేసిన కాంగ్రెస్ పార్టీకి తగ్గిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రైతులందరికీ తక్షణమే రుణమాఫీ చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పెద్దిటి బుచ్చిరెడ్డి, బొడ్డు శ్రీనివాస్‌రెడ్డి, సుర్వి యాదయ్యగౌడ్, ఢిల్లీ మాధవరెడ్డి, నర్రి నర్సింహ, శ్రీనివాస్‌గౌడ్, మల్లేశంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, పర్వతాలు యాదవ్, పరమేశ్, వెంకట్‌రెడ్డి, బాలరాజు, యాదగిరి, ఆకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి



భూదాన్ పోచంపల్లిలో రైతులతో కలిసి నిరసన దీక్ష చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 22 : రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని నేతాజీ రస్తా వద్ద గురువారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులందరికీ రుణమాఫీ చేయాలని, రైతు బంధు ఆపవలసిన అవసరం లేదని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాటి సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, పీఏసీఎస్ చైర్మన్ కందాటి భూపాల్‌రెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, మాధవరెడ్డి, బాలనర్సింహ, మల్లేశంగౌడ్, నర్సింహ, సుధాకర్‌రెడ్డి, శ్రీకాంత్, రోషన్ పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

రైతులతో కలిసి నిరసన దీక్ష చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

లిగొండ, ఆగస్టు 22 : ఎటువంటి ఆంక్షలు లేకుండా రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు మండల కేంద్రంలో గురువారం రైతులతో కలిసి చేపట్టిన నిరసన దీక్షలో ఆయన మాట్లాడారు. రైతులందరికీ రుణమాఫీ చేసినట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకొంటుందని, అనేక ఆంక్షలతో సగం మందికి మాఫీ జరుగలేదని అన్నారు. ప్రభుత్వం బేషరతుగా రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ రుణమాఫీ అయ్యే వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, నాయకులు పనుమటి మమతా నరేందర్‌రెడ్డి, ముద్దసాని కిరణ్‌రెడ్డి, కీసర్ల సత్తిరెడ్డి, ఏనుగు అంజిరెడ్డి, కొండూరి వెంకటేశం, మల్లారెడ్డి, మంజుల పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాసులు

'రైతులకు అడ్డగోలు ఆంక్షలు తగవు'

బీబీనగర్, ఆగస్టు 22 : కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డగోలు ఆంక్షలతో రైతులను మోసం చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు, రైతుబంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు బొక్క జైపాల్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంకు వరణలో గురువాం ధర్నా నిర్వహించారు. అనంతరం తాసీల్దార్ ఎం.శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏకకాలంలో మాఫీ చేయకుండా అడ్డమైన షరతులు, ఆంక్షలు పెట్టడం దారుణమన్నారు. ఇప్పటి వరకు పావు శాతం మందికి కూడా రుణమాఫీ కాలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్‌రెడ్డి, నాయకులు బాలచందర్, రవికుమార్, లక్ష్మీనారాయణ, సంతోష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బస్వారెడ్డి, రమేశ్, నాగరాజు, పాండు, దేవేందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ధర్నాకు తరలిన రైతులు

ఆత్మకూరు(ఎం), ఆగస్టు 22 : రైతులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మాజీ మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో ఆలేరులో నిర్వహించిన ధర్నాకు ఆత్మకూరు(ఎం) మండలం నుంచి సుమారు 200 మంది రైతులు తరలివెళ్లారు. అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో వాహనాల్లో వెళ్లారు. ధర్నాకు వెళ్లిన వారిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్, జిల్లా, మండల నాయకులు భిక్షపతి, ఉప్పలయ్య, వెంకటేశ్‌గౌడ్, అరుణ, వెంకన్న, మల్లేశం, రైతులు ఉన్నారు.

స్వామి రామానందతీర్థలో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 22 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ద్వారా నిర్వహించే ఉపాధి సాంకేతిక శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ ఇన్‌చార్జి డైరెక్టర్ సాయిలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల కాల పరిమితితో కూడిన బేసిక్ కంప్యూటర్స్ (డాటా ఎంట్రీ ఆపరేటర్)కు ఇంటర్మీడియట్ పాస్ అయినవారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, రేషన్ కార్డులతో సెప్టెంబర్ 9న ఉదయం 10 గంటలకు స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో హాజరు కావాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులు 250 రూపాయల రిఫండబుల్ డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రుణమాఫీ కాని రైతులు అధికారులను సంప్రదించాలి

అడ్డగూడూరు, ఆగస్టు 22 : రుణమాఫీ కాని రైతులు ఆందోళన చెందకుండా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని సింగిల్ విండో చైర్మన్ కొప్పుల నిరంజన్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిన్న పడిశాల గ్రామంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అడ్డగూడూరు సింగిల్‌విండో పరిధిలో 1,162 మంది రైతులకు 600 మందికి రుణమాఫీ అయ్యిందని, 500 మందికి కాలేదని తెలిపారు. మొత్తం రూ.6.80 కోట్లకు రూ.3కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతుకూ రుణమాఫీ అవుతుందని, ఎవరూ ఆందోళన చెందవద్దని సూచించారు. సమావేశంలో నాయకులు భిక్షంరెడ్డి, సమ్మయ్య, రాంబాబు ఉన్నారు.

సేంద్రియ సాగు విధానంలో రైతు బాల్‌రెడ్డి మేటి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

రైతు బాల్‌రెడ్డి, జ్యోతి దంపతులను సత్కరిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 22 : సేంద్రీయ విధానం ద్వారా పెట్టుబడిని పదిశాతం తగ్గిస్తూ మేలిమి పంటలు పండిస్తున్న రైతు జిట్టా బాల్‌రెడ్డి రైతు సమాజానికి ఆదర్శమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. రాజబహద్దూర్ కోత్వాల్ వెంకటరామరెడ్డి 150వ జయంతిని పురస్కరించుకుని మండలంలోని రామకృష్ణాపురం అమేయ కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన పురస్కార సభలో బాల్‌రెడ్డి, జ్యోతి దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగంపై ఉన్న మక్కువతో వ్యవసాయ క్షేత్రాన్ని ఏర్పాటు చేసి హోమియోపతి మందులను ఉపయోగిస్తూ అధిక దిగుబడులు సాధించడం అభినందనీయమన్నారు. బాల్‌రెడ్డి దంపతుల పరిశోధనలు దేశవ్యాప్తంగా ప్రచారం పొందడం తెలంగాణకు గర్వకారణమని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఘంటా జలంధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ సుబ్బూరు బీరుమల్లయ్య, కౌన్సిలర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, రాచమల్ల రమేశ్, లయన్ అహ్మద్, నాగభూషణం, ఆత్మీయ భారతి సంస్థ అధ్యక్షుడు వాకిటి రాంరెడ్డి పాల్గొన్నారు.

రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటించాలి

- ఏరువాక కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్

వీరవెల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏరువాక శాస్త్రవేత్తలు

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 22 : రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏరువాక కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ బి.అనిల్‌కుమార్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఏరువాక కేంద్రం, వ్యవసాయ కళాశాల రాజేంద్రనగర్ సంయుక్త ఆధ్వర్యంలో మండలంలోని తాజ్‌పూర్, నాగిరెడ్డిపల్లి, వీరవెల్లి, చందుపట్ల గ్రామాల్లో గురువారం వయ్యారిభామ కలుపు మొక్కల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్థీనియం అని పిలిచే ఈ మొక్కలు 1956లో గోధుమలు దిగుమతి చేసినప్పుడు అమెరికా నుంచి మన దేశంలోకి వచ్చాయన్నారు. 1970లో మహారాష్ట్రలోని పుణెలో మొదటగా భారత శాస్త్రవేత్తలు కనుగొన్నారని తెలిపారు. దేశమంతా విస్తరించిన వయ్యారిభామ కలుపు మొక్కల ప్రభావంతో 40శాతం పంటల దిగుబడి నష్టం కలుగుతుందన్నారు. వయ్యారిభామ పుప్పొడి రేణువులు, ఎండిపోయిన మొక్క భాగాలు, మూలాల వల్ల డెర్మటైటిస్, ఆస్తమా వంటి ఎలర్జీ